ఉచిత వైద్య శిబిరం

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కంటోన్మెంట్ వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని లోతుకుంట సరస్వతినగర్ కాలనీలో కంటోన్మెంట్ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. దోమల ద్వారా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికన్‌గున్యా, ఇతర వైరల్ ఫీవర్ రాకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామని ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బాలమణి, కాలనీవాసులు సాయిబాబా, శంకరయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత కోసం నైపుణ్య శిక్షణకేంద్రం



కార్యక్రమంలో పాల్గొన్న సీఈఓ మధుకర్ నాయక్.

రసూల్‌పురా: పేద ప్రజలు నివసించే రసూల్‌పురా ప్రాంతంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వారి కోసం ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు, యువత కోసం నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ డి. మధుకర్ నాయక్ అన్నారు. జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జీస్పాన్ సహకారంతో రసూల్‌పురా బీహెచ్ఈఎల్ కాలనీలో రాణి రుద్రమదేవి మహిళా సాధికారత, యువత నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని జీస్పాన్ సంస్థ సీఈఓ మోహిత్ మల్లిక్‌తో కలసి మధుకర్ నాయక్ మంగళవారం ప్రారంభించారు. సిఎస్సార్‌లో భాగంగా సమాజంలోని పేద మహిళలు ఉపాధి అవకాశాలు పొందేందుకు నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఘట్‌కేసర్, సిద్దిపేట, ఇతర ప్రాంతాల్లో నైపుణ్యాలపై శిక్షణ అందజేస్తున్నామని మోహిత్ మల్లిక్ తెలిపారు.

జాతీయ జెండాల ఆవిష్కరణ

అమీర్‌పేట: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అమీర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో బీజేపీ నాయకులు సామూహికంగా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు మంగళవారం ఉదయం జాతీయ గీతాన్ని ఆలపించి జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ,అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, పార్టీ నేతలు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, రాంమోహన్‌రావు,మేకల సారంగపాణి, శ్రీశైలంగౌడ్,చందు తదితరులు పాల్గొన్నారు.

మీడియా కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్‌గా చౌదరిగౌడ్

అమీర్‌పేట: తెలంగాణ మీడియా కమ్యూనికేషన్స్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కమ్మగోని చౌదరిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మీడియా, కమ్యూనికేషన్స్ రాష్ట్ర చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చౌదరిగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం సైనికుల్లా పనిచేసిన ప్రతీ ఒక్క కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానని అన్నారు.పదవి కావడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి బాలలే రేపటి పౌరులు

రాంగోపాల్‌పేట్: నేటి బాలలే రేపటి పౌరులని బావి భారత పౌరులైన విద్యార్థులు విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య మెమోరియల్ హైస్కూల్ ఆధ్వర్యంలో విశ్వకర్మ సంఘం హాలులో స్వాతంత్ర్య దినోత్సవ, క్యాబినెట్ లీడర్ల ఇన్వెస్టీచర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో కళాశాల స్థాయిలో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగేవని అందులో పాల్గొనే చాలా మంది కాలక్రమంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులు అయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు కొత్త నాగనాథం, కరస్పాండెంట్ శంతన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ అనుబంధ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలసి మహేందర్ ఓయూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కాంట్రాక్టర్లను, మధ్య దళారీలను తొలగించి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు యూనివర్సిటీ నుంచి నేరుగా వేతనాలు చెల్లించాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీతారాం, నాగరాజు, లక్ష్మన్‌రాజు, మహేందర్, బాలకృష్ణ, యాదమ్మ, రాధిక, లలిత, శాంతబాయి, తస్లీమా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో పీడీఎస్‌యూ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు మూసివేత దిశగా పయనిస్తున్నాయని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు ధ్వజమెత్తారు. ర్యాంకుల తగ్గుదల, వర్సిటీల ప్రభుత్వాల నిర్లక్ష్యం పై మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. అన్ని వర్సిటీలకు వీసీలను నియమించాలని, అధ్యాపక, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెంచిన ఫీజులను తగ్గించాలని, హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవీన్, వంశీ, యశ్వంత్, వికాస్, అరవింద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీలో జూడాల ఓపీ విధులు బహిష్కరణ

గాంధీఆస్పత్రి : దారుణహత్యకు గురైన వైద్యవిద్యార్థిని ఘటనలో నిందితులపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం అవుట్‌పేషెంట్ (ఓపీ) విధులను బహిష్కరిస్తున్నట్లు జూడాల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు. కోల్‌కతాలో జరిగిన ఘటనను ఖండిస్తూ మంగళవారం గాంధీఆస్పత్రి ప్రాంగణంలో జూడాలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిందితులపై తక్షణ చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీజీజేడీఏ గాంధీ యూనిట్ ప్రతినిధులు అబ్బయ్య, రాజు, కిరణ్ లతోపాటు జూడాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ఇక నీటి లెక్క పక్కా

- అధికారిక గెజిట్ విడుదల చేసిన కేంద్రం
- బోర్‌వెల్స్ వినియోగానికి ప్రత్యేక నిబంధనలు
- అన్ని బోర్‌వెల్స్ రిజిస్ట్రేషన్ చేయించాల్సిందే..
- కమర్షియల్ వినియోగంపై అదనపు చార్జీలు వసూలు



కంటోన్మెంట్: ఇకపై కంటోన్మెంట్‌లో నీటి లెక్క పక్కాగా తేలనుంది. కంటోన్మెంట్ పరిధిలోని బోర్‌వెల్స్ అన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ప్రతీ రోజూ ఎంతమేరకు నీటిని తోడుతున్నారో లెక్క చెప్పాల్సిందే. అంటే కంటోన్మెంట్‌లో భూగర్భ జలాల వినియోగంపై క్రమం తప్పకుండా ఆడిట్ చేయనున్నారు. ఈ మేరకు రూపొందించిన నిబంధనలకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. దీంతో కంటోన్మెంట్‌లో బోర్‌వెల్స్ నియంత్రణ, క్రమబద్ధీకరణ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ ఎస్ఆర్ఓ 126 (ఈ) పేరిట గెజిట్(రాజపత్రం) విడుదల చేసింది.

- ఇకపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని బోర్‌వెల్స్‌కు ''సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు (డిగ్గింగ్ అండ్ యూజ్ ఆఫ్ బోర్‌వెల్స్) రెగ్యులేషన్స్, 2024'' నిబంధనలు వర్తించనున్నాయి.
- ఈ నిబంధనలపై అభ్యంతరాలను వెల్లడించాల్సిందిగా కోరుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 23న కంటోన్మెంట్ బోర్డు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.
- తదనుగుణంగా మార్చి 05, 2024 వరకు అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, ది కంటోన్మెంట్స్ యాక్ట్ 2006 (41 ఆఫ్ 2006), సెక్షన్ 204 (4) ప్రకారం నూతన నిబంధనలు రూపొందించింది. తాజాగా ఈ నిబంధనలను ఆమోదిస్తూ కేంద్రం గెజిట్ విడుదల చేసింది.

ఏం చేస్తారంటే..

- నూతన బోర్‌వెల్స్ నిబంధనల మేరకు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రస్తుతమున్న బోర్‌వెల్స్‌కు సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించనున్నారు.
- ప్రస్తుతానికి వినియోగంలో ఉన్న బోర్‌వెల్స్, ఎప్పుడు వేశారు? ఎంత లోతులో ఉన్నాయి? తదితర వివరాలను సేకరిస్తారు.
- భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి కేంద్ర జలశక్తి, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో కలిసి సర్వే నిర్వహిస్తారు.
- కంటోన్మెంట్‌లో బోర్‌వెల్స్ నియంత్రణ, క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రత్యేక అధికారిని నియమిస్తారు.
- ప్రస్తుతం కొనసాగుతున్న తాగునీటి సరఫరా, నీటి లభ్యత తదితర అంశాలపై కూడా సమగ్ర అధ్యయనం చేస్తారు.
- గృహ అవసరాల కోసం వినియోగించే బోర్‌వెల్స్, ఆర్మీ, పోలీసు, వ్యవసాయ, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు వినియోగించే బోర్‌వెల్స్‌ను క్రమబద్ధీకరణ నుంచి మినహాయించనున్నారు.
- మినహాయింపు పరిధిలోనికి రాని అన్ని బోర్‌వెల్స్‌ను నెల వ్యవధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.
- కమర్షియల్, పరిశ్రమల అవసరాలకు వినియోగించే నీటికి రోజుకు 50 లీటర్లకంటే ఎక్కువగా నీళ్లను తోడితే, ప్రతి కిలో లీటరకు రూ.10 చొప్పున చార్జీ చెల్లించాల్సి ఉంటుంది
- కాలనీల్లో నూతనంగా వేసే బోర్‌వెల్‌కు రూ.3 వేలు, బస్తీల్లో వేసే బోర్‌వెల్‌కు రూ.1వెయ్యి చొప్పున చార్జీ చెల్లించాలి.
- భూగర్భ జలాలను బోర్డు అనుమతి లేకుండా ఇతరులకు విక్రయించరాదు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే, సంబంధిత బోర్‌వెల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి.

అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి



అవయవదానాన్ని ప్రోత్సహిస్తున్న గాంధీ ప్రిన్సిపాల్ ఇందిరను సన్మానిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: అవయవదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మరణించిన వారి అవయవాలను దానం చేసి మరికొంతమందికి పునర్జన్మ కల్పించాలని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర సూచించారు. వరల్డ్ డోనర్స్‌డే వారోత్సవాలను పురస్కరించుకుని అఖిలభారత, తెలంగాణ డోనర్స్ అసోషియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ మెడికల్ కాలేజీ సెమినార్‌హాలులో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర మాట్లాడుతూ.. అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవయవదానం చేస్తామని వైద్య విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం అవయవదానాన్ని ప్రోత్సహిస్తున్న గాంధీ ప్రిన్సిపాల్ ఇందిరను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాంధీ వైస్‌ప్రిన్సిపాల్స్ వాలియా, రవిశేఖర్, డోనర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ భారతి పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... సంజీవయ్య పార్కు నుంచి వేగంగా వెళుతున్న లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి వ్యక్తి జారిపడ్డట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటనస్థలానికి వెళ్లిన పోలీసులు తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు లభించలేదు. కొద్ది గంటల్లోనే గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారుగా 30 ఏళ్లు ఉంటాయని, ఒంటిపై బూడిద రంగు జీన్స్ ప్యాంటు, లేత ఆకుపచ్చ టీ షర్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాల కోసం 8712658581 నెంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు కోరారు.

‘దేవనార్’లో అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



సనత్‌నగర్: బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన రెండు అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లను కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే మంగళవారం ప్రారంభించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌తో కలిసి ల్యాబ్‌లను ప్రారంభించిన ఆయన అంధ విద్యార్థులకు ఏవిధంగా విద్యాబోధన చేస్తారు..కంప్యూటర్ విద్యను ఎలా అభ్యసిస్తారనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాందాస్ అథవాలే మాట్లాడుతూ అంధ చిన్నారులకు దేవనార్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాలలోని చిన్నారులతో ముచ్చటించి యోగక్షేమాలు, వారి అభ్యాసనా విధానం గురించి సంభాషించారు. కార్యక్రమంలో దేవనార్ వ్యవస్థాపకులు సాయిబాబాగౌడ్, సెక్రటరీ జ్యోతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: గుర్తు తెలియని యుకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం... సోమవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి 28 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై ఆకుపచ్చ టీ షర్టు, నీలిరంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సీతాఫల్‌మండిలో తిరంగా ర్యాలీ



సికింద్రాబాద్: సీతాఫలమండి వీరమాచినేని పగడయ్య స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాటం, యోధుల త్యాగాల పట్ల అవగాహన కలిగించి దేశభక్తిని ఇనుమడింపజేసేందుకు పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక కార్పొరేటర్ సామల హేమ, పాఠశాల కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు వీరమాచినేని రమేష్ బాబు, విజయ్ కుమార్, లష్కర్ ఆధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి వినతి పత్రం సమర్పించారు. మంగళవారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వర్సిటీల ప్రధాన సమస్యలు, వాటి సాధ్యమైన పరిష్కారాలను చిన్నారెడ్డి దృష్టికి తీసుకొచ్చినట్లు టౌటా అధ్యక్షులు ప్రొ.మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో ప్రొ.శ్రీనివాస్, డా.చలమల్ల వెంకటేశ్వర్లు, ప్రొ.సరస్వతమ్మ, డా.లోక పావని, డా.అరుణ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

దోపిడీ కేసులో ముగ్గురికి జైలు

సికింద్రాబాద్: ఒక ప్రయాణికుడిని కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్, నగదు దోపిడీ చేసిన కేసులో ముగ్గురు నిందితులకు మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే సెకండ్ మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి గౌస్‌పాషా శిక్ష విధించారు. ఈ నేరానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు సంవత్సర కాలం కఠిన జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు. ఉందానగర్ రైల్వే స్టేషన్‌లో 2023 ఆగస్టు 20న కేశవ అనేప్రయాణికుడిని ముగ్గురు ఆగంతకులు అడ్డుకున్నారు. కొద్ది దూరం తీసుకెళ్లి కత్తి చూపించి సెల్‌ఫోన్, నగదును లాక్కొని ఉడాయించారు. బాధితుడు కాచిగూడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన రైల్వే పోలీసులు నేరానికి సంబంధించిన ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తు రిపోర్టు ఆధారంగా జడ్జి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హుస్సేన్ సాగర్‌లో దూకిన మహిళ : రక్షించిన పోలీసులు

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ హుస్సేన్ సాగర్లో దూకి ఆత్మహత్యకు యత్నించగా సెక్రటరియేట్ పోలీసులు రక్షించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఖమ్మంకు చెందిన ఓ మహిళ నగరంలో ఉండే బంధువుల వద్దకు వచ్చింది. ఆమె కుటుంబం గత కొద్ది రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది. దీంతో మంగళవారం మధ్యాహ్నం ట్యాంక్‌బండ్‌కు చేరుకుని హుస్సేన్ సాగర్‌లో దూకింది. వెంటనే స్థానికులు పోలీసులకు స మాచారం ఇవ్వడంతో సెక్రటరియేట్ పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాడు శివ సహాయంతో ఆమెను రక్షించారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హర్ ఘర్ తిరంగాలో ఎన్‌సీసీ కేడెట్లు

రసూల్‌పురా: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఎన్‌సీసీ క్యాడెట్లు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం. రెడ్డి తెలిపారు. మంగళవారం డైరెక్టరేట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయం పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, వరంగల్, గుంటూరు, తిరుపతి, కర్నూలు, కాకినాడ, విశాఖపట్టణంలోని ఎన్‌సీసీ వివిధ బెటాలియన్ గ్రూప్ క్యాడెట్లు 15వ తేదీ వరకు స్ట్రీట్ ప్లే, నుక్కడ్ నాటక్, పోస్టర్ క్యాంపెయిన్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నారని 69 యూనిట్ల లోని మొత్తం 6వేల 918 మంది క్యాడెట్లు పాల్గొంటున్నారని చెప్పారు.



రేపు తార్నాకలో ‘మూలం సంత’

లాలాపేట: గ్రామ భారతి 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ నెల 15న తార్నాకలోని మర్రికృష్ణా ఫంక్షన్ హాల్లో ‘మూలం సంత’ను ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఉ.10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల కొనసాగుతుందన్నారు. ఇందులో వ్యవసాయ ఉత్పత్తులు, అనుబంధ కుటీర పరిశ్రమలకు చెందిన ఉత్పత్తులను విక్రయానికి అందుబాటులో ఉంచుతామన్నారు.

పాత భవనంలో భోజనశాల..

వర్షపు నీటితో ఇబ్బంది

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గత ఏడాది నుంచి పాత భవనంలో భోజనశాలను ఏర్పాటు చేయడంతో ఓయూ పీహెచ్‌డీ విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపించారు.

వివిధ పీహెచ్‌డీ కోర్సుల స్కాలర్స్‌కు ఓల్డ్‌పీజీ, న్యూపీజీ, ఎస్ఆర్ఎస్ పేరుతో ప్రత్యేకంగా మూడు పక్కా హాస్టల్ భవనాలు, భోజన శాలలు ఉన్నాయి. ప్రొఫెసర్ల కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో భోజనశాలలను మూసివేసి ఒకే చోట ఏర్పాట్లు చేశారు. కానీ గత ఏడాది హెల్త్ సెంటర్ పక్కన గల పాత భవనంలో భోజనశాలను ఏర్పాటు చేశారు. పాత భవనం వలన వర్షాలకు పై కప్పు కురవడంతో విద్యార్థులు వర్షపు నీటితో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అల్పాహార సమయంలో వర్షం కురవడంతో భవనం పై కప్పు నుంచి నీరు కారి భోజనశాల జలమయమైంది. దీంతో విద్యార్థులు తింటునే వర్సిటీల అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. పీహెచ్‌డీ విద్యార్థులకు గతంలో ఉన్న భోజనశాలలను ప్రారంభించి ఎక్కడివారికి అక్కడే మెస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దెత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

ఆసుపత్రి భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి



కుట్టివెల్లోడి ఆసుపత్రి నిర్మాణం పనులు సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫలమండిలో నిర్మిస్తున్న కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి భవనం సముదాయం నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రి నిర్మాణ పనుల తీరుతెన్నులను ఎమ్మెల్యే సమీక్షించారు. పనుల్లో పురోగతి గురించి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు ఉపకరించేలా సీతాఫల్‌మండిలో మల్టీ స్పెషాలిటీ సదుపాయాల ఆసుపత్రిని నిర్మిస్తున్నామని చెప్పారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమతో పాటు నిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ ప్రసాదించొచ్చు



అవయవ మార్పిడి చేయించుకున్న వారితో వైద్యులు

రాంగోపాల్‌పేట్: బ్రెయిన్‌డెడ్ అయిన వారి అవయవాలను దానం చేయడం ద్వారా ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదించవచ్చని యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా యశోద ఆస్పత్రిలో విజయవంతంగా కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం మార్పిడి చేసికుని పునర్జన్మ పొందిన 35 మందితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్ కేసుల్లో అవయవదానం చేసే వారి సంఖ్య 0.36 నుంచి స్వల్పంగా పెరిగి ఒకటికి చేరుకుంటుండటం సంతోషించదగ్గ విషయన్నారు. దేశంలోనే అత్యధికంగా ప్రతి పదిలక్షల జనాభాకు 5 మంది వరకు ఇక్కడ అవయవదానం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ బ్రాంచ్ హెడ్ డాక్టర్ విజయ్‌కుమార్‌తో పాటు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

విషజ్వరాలతో జాగ్రత్త



ఇన్‌పేషెంట్లతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: గ్రేటర్ హైదరాబాద్‌లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. అక్కడికి వచ్చిన వారితో మాట్లాడి అక్కడి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసారు. కార్యక్రమంలో ఎస్పిహెచ్ఓ డాక్టర్ జయశ్రీ, డాక్టర్ పల్లవి, డాక్టర్ సరిత, ఎంటమాలజీ అధికారి దుర్గా ప్రసాద్, సూపర్‌వైజర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీకి ఓయూ నుంచి ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) నేతలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తరలివెళ్లారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.కాశీం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఓయూ నుంచి బారి సంఖ్యలో కదిలి మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికినట్లు ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో డా. సంగమేశ్వర్ మాదిగ, కోమ్ముశేఖర్ మాదిగ, ఓయూ అధ్యక్షులు మందరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణకు గజమాలతో సత్కారం



రసూల్‌పురా: సామాజికంగా, న్యాయపరంగా, రాజకీయంగా ఎస్సీ వర్గీకరణ అంశం సంవత్సరాలుగా నలిగిందని చిట్టచివరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతత్వంలో సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇంచార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన అనంతరం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న మందకృష్ణమాదిగకు కంటోన్మెంట్ నాయకులు మంగళవారం ఘనస్వాగతం పలికారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రధాని మోదీ వర్గీకరణపై ఆమోదం తెలిపిందన్నారు. సందర్భంగా మందకష్ణ మాదిగను గజమాలతో సత్కరించారు.

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులో మంగళవారం ఎమ్మార్పీఎస్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్యాట్నీ నుంచి బాటా, కింగ్స్‌వే, బైబిల్ హౌస్, కర్బలామైదాన్, ట్యాంక్‌బండ్ గుండా సాగింది. మంద కృష్ణ మాదిగ భారీ వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

రజక విభాగం కన్వీనర్‌గా రాజేశ్వరి



సికింద్రాబాద్: బీజేపీ ఓబీసీ సెల్ రజక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఆ పార్టీ నాయకురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి నియమితులయ్యారు. ఆమెను కన్వీనర్‌గా నియమిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్ గౌడ్ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ మొదటిసారిగా రజక విభాగాన్ని ఏర్పాటు చేసి తనను అధ్యక్షురాలిగా నియమించడం పట్ల పార్టీ అధిష్టానం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రజకులందరినీ జాగృతం చేసి వారికి వారికి కేంద్ర ప్రభుత్వ ఫలాలు అందించి తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.